క్లుప్తంగా

మద్యం సీసాలు స్వాధీనం

కొమరాడ: మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ సందరాపురం గ్రామానికి చెందిన వారణాసి తవిటిరాజు మోటారు సైకిల్‌పై మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై నీలకంఠం బుధవారం తెలిపారు. అతని వద్ద 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు మోటార్ సైకిల్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సాగు పనులు ముమ్మరం..



గుమ్మలక్ష్మీపురంలో పొలం గట్లను సరిచేస్తున్న రైతులు

గుమ్మలక్ష్మీపురం: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. నీటితడులు అందడంతో వరినారు పచ్చగా కనిపిస్తోంది. పొలాల్లో నీరు చేరడంతో రైతులు పొలాలను దమ్ములు చేసి వరినాట్లు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. పొలం గట్లు సరిచేయడం, గట్ల మధ్య రంధ్రాలను పూడ్చడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు.

అంకితభావం తప్పనిసరి

● న్యాయమూర్తి విజయరాజ్‌కుమార్



ఆర్టీసీ సిబ్బంది, డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి విజయరాజ్‌కుమార్

పాలకొండ రూరల్: విధి నిర్వహణలో అంకితభావం అవసరమని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయరాజ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ... నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఆర్టీసీ డ్రైవర్లపై ఉన్న నమ్మకంతో బస్సుల్లో ప్రయాణాలు సాగిస్తారన్నారు. వారి నమ్మకం ఒమ్ము చేయకూడదని సూచించారు. ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం ఇవ్వకుండా వాహనాలను నడపాలన్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగి వ్యక్తిగత, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. నూతన చట్టాల ప్రకారం రోడ్డు ప్రమాదాలకు కారకులైన వారిపై నమోదు చేయబడే కేసులు, వాటి తీవ్రత, అనుభవించాల్సిన శిక్షలపై న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యులు పల్లా మునిస్వామి, మరిచర్ల జగన్ మోహనరావు, బి.రామ్మోహనరావు, ఎం.వెంకటేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరావు, ఇతర ఆర్టీసీ అధికారులు, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

కృషివిజ్ఞాన కేంద్రం సేవలపై అవగాహన



కేవీకేలో పంటల సాగు పద్ధతులను విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కురుపాం: మండలంలోని రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం సేవలపై నైర వ్యవసాయ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు అందజేస్తున్న శిక్షణ కార్యక్రమాలు, డెమో యూనిట్స్, క్షేత్ర పరిశీలనలు, ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలు, వివిధ రకాల నూతన వంగడాలు, పంటల సాగు పద్ధతులను వ్యవసాయ శాస్త్రవేత్తలు విహారి, రమేష్‌బాబు, అను, ఉమాజ్యోతి వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ పాల్గొన్నారు.

తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి

● నాక్ బృంద సభ్యులు

పాలకొండ రూరల్: సర్కారు అందిస్తున్న తోడ్పాటును విద్యార్థులు అందిపుచ్చుకుని సమాజంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని నాక్ బృంద సభ్యులు స్పష్టం చేశారు. రెండు రోజులుగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొలువుదీరిన బృందం కళాశాలలో గ్రీన్ బోర్డ్స్, డిజిటల్ తరగతి గదులు, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, తదితర అంశాలను బుధవారం క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. విద్యాప్రమాణాల సంతృప్తి స్థాయిపై ఆరాతీసి సానుకూలంగా స్పందించారు. మాతృభాష తెలుగుతో పాటు ఆంగ్లం కూడా తప్పనిసరిగా నేర్చుకోవాలని బృందసభ్యులు హేమలత బాగ్లా, మేరియాన ఫెర్నాండైజ్, జోషఫ్ లోనస్, తదితరులు తెలిపారు. కళాశాల అభివృద్ధికి నాక్ తరఫున సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు, ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు, జయమణి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం ..

- వర్షాలు పడుతున్నందున విష జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం
- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకుంటే ముప్పు తప్పదు
- వ్యాధుల నియంత్రణకు కొనసాగుతున్న పారిశుధ్య పక్షోత్సవాలు



పారిశుధ్య నిర్వహణపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న పలుశాఖల అధికారులు

పాలకొండ రూరల్: వర్షాకాలం ప్రారంభమైందంటే వ్యాధుల సీజన్ వచ్చినట్లే. వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రతలతో విలవిల్లాడిన ప్రజలకు ప్రస్తుత సీజన్‌లో కురిసే వర్షాలు కాస్త ఆహ్లాదాన్ని పంచినా, వ్యాధులను కూడా తీసుకువచ్చే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా వర్షాలు అడపాదడపా కురుస్తున్నాయి. దీంతో పాతనీరు కొత్తనీరు కలుస్తుండడంతో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం లోపించి ఎక్కడికక్కడ మురుగు నీరు, వర్షం నీరు నిల్వ ఉండడంతో దోమలు, క్రిములు వృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో ఎక్కువగా వివిధ రకాల అంటువ్యాధులు, విషజ్వరాలు సోకే అవకాశాలున్నాయి. వాతావరణంలో వచ్చే మార్పులు, ఇంటి పరిసరాల్లో నిలిచే మురుగు నీటిలో వృద్ధి చెందే దోమల కారణంగా మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. కలుషిత నీరు, ఆహారంతో డయేరియా ప్రబలే అవకాశం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

మలేరియా ..

మలేరియా వ్యాధి ప్లాస్మోడియం అనే పరాన్నజీవి ద్వారా ఇన్ఫెక్ట్ అయిన ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం ద్వారా వస్తుంది. ఆ దోమలు మంచినీరు, మురుగు నీటి నిల్వల్లో పెరిగి మలేరియా వ్యాధిని వ్యాప్తి చేస్తాయి. ఈ దోమ వాలినప్పుడు ఏటవాలుగా ఉంటుంది. ఇది కుట్టడం వలన ఏడు నుంచి పది రోజుల్లోపు చలి, వణుకు, ఒళ్లు నొప్పులతో కూడిన విపరీతమైన జ్వరం రోజు తప్పించి రోజు వస్తుంది. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్యులను సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స పొందాలి.

డెంగీ..

ఆకస్మికంగా జ్వరంతో వివిధ నొప్పులు ఉంటే అది డెంగీ జ్వరం కావచ్చు. ఆడ ఈడిస్ దోమ ద్వారా డెంగీ వ్యాపిస్తుంది. ఈ దోమపై తెల్లని చారలు ఉంటాయి. దీనిని టైగర్ దోమ అనికూడా అంటారు. ఇవి ఇంటి లోపల, ఆవరణలో ఉంటాయి. పగటిపూట ఎక్కువగా కుడతాయి. ఈ దోమ మంచి నీటిలోనే గుడ్లు పెడుతుంది. ఈ దోమకాటు తర్వాత మూడు నుంచి 14 రోజుల్లో డెంగీ రావచ్చు. ఆ వ్యాధి వల్ల ఆకస్మికంగా జ్వరంతో పాటు కీళ్ల , కండరాలు, కంటినొప్పులు, వాంతులవుతాయి. కొంత దికి శరీరంపై ఎర్రటి దద్దుర్లు, పంటి చిగుళ్ల నుంచి రక్తస్రావం అవుతుంది. దీనికి అత్యవసరమైన చికిత్సతో పాటు కొందరికి ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి వస్తుంది. గర్భిణులు, చిన్న పిల్లలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి ప్రమాదం ఎక్కువ కాబట్టి చికిత్స త్వరితగతిన చేయించుకోవాలి.

చికున్ గున్యా..

చికున్ గున్యా వైరస్‌తో ఇన్ఫెక్ట్ అయిన ఈడిస్ దోమ కుట్టడం ద్వారా వ్యాధి ఆశిస్తుంది. ఈ దోమ కుట్టిన 3 నుంచి 12 రోజుల్లోపు జ్వరం వస్తుంది. తలనొప్పి, వాంతులు, వికారంతో హఠాత్తుగా వచ్చే జ్వరం దీని ముఖ్య లక్షణం. ఇది శరీరంలో అన్ని కీళ్లను బాధిస్తుంది . ముఖ్యంగా చేతి వేళ్లు , కీళ్ల నొప్పుల వల్ల నిలబడలేని పరిస్థితి ఉంటుంది. జ్వరం తగ్గినా ఈ నొప్పులు చాలాకాలం ఉంటాయి. ఈ లక్షణాలు కనబడిన వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలి.

అతిసార, టైఫాయిడ్..

కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల అతిసార, టైఫాయిడ్ వ్యాధులు సంక్రమిస్తాయి. రోజుకు మూడు అంతకంటే ఎక్కువగా నీళ్ల విరేచనాలు అయితే దాన్ని అతిసారగా భావించాలి. ఇది బ్యాక్టీరియా వల్ల కాని వైరస్ వల్ల కానీ రావచ్చు. ఇది ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. ముఖ్యంగా పారిశుధ్య లోపం వల్ల అతిసార వస్తుంది. దీంతో వాంతులు విరేచనాలు, కడుపునొప్పి, అధిక దాహం, నోరు ఎండిపోవడం, మూత్ర విసర్జన తగ్గిపోవడం ఈ వ్యాధి లక్షణాలు. అలాగే క్యూలెక్స్ దోమ వల్ల ఫైలేరియా (బోద) ఆశిస్తుంది.

పంచాయతీల్లో ప్రత్యేక చర్యలు..



గ్రామాల్లోని మురికివాడలు, డ్రైనేజీల్లో వర్షపునీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నాం. వీధులు, రోడ్ల వెంబడి చెత్తాచెదారాలు పేరుకుపోకుండా ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపడుతున్నాం. కలెక్టర్ ఆదేశాలతో అన్ని శాఖల సమన్వయంతో పారిశుధ్య పక్షోత్సవాలు చేపడుతున్నాం. రక్షితనీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేస్తున్నాం. వైద్యుల సహకారంతో ఇంటింట ఫీవర్ సర్వే చేపడుతున్నాం. సమస్యలు తలెత్తితే ప్రజలు అధికారులకు వివరించాలి. మండలంలోని రెండు పీహెచ్‌సీల సిబ్బంది సహకారంతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం.

– ఎస్.రామకృష్ణ, ఎంపీడీఓ, పాలకొండ

అవగాహనతో అధిగమించాలి



సీజన్‌తో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. వైరస్‌లు, బ్యాక్టీరియా వల్ల జ్వరాలు ప్రబలుతాయి. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీరు తాగాలి. వేడి పదార్థాలు తీసుకోవాలి. వంటపాత్రలపై మూతలు పెట్టుకోవాలి, ఇంటిచుట్టూ మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఆరోగ్య సమస్య చిన్నదైనా వైద్యులను సంప్రదించాలి.

జి.నాగభూషణరావు, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి

గ్రంథాలయ పితామహుడికి నివాళి



వెంకటరమణయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ నిర్వాహకుడు, విద్యార్థులు

గరుగుబిల్లి: గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఐయ్యంకి వెంకటరమణయ్య జయంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణయ్య చిత్రపటం వద్ద గ్రంథాలయ నిర్వాహకుడు ఎస్.మధుసూదనరావు, పాఠకులు నివాళులర్పించారు. పౌరగ్రంథాలయాల ఏర్పాటు, విస్తరణకు ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. గ్రంథాలయాల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.

ఒత్తిడి వల్లే ఎంపీడీఓ మృతి...!

నివాళులర్పించిన మండల పరిషత్ ఉద్యోగులు



జియ్యమ్మవలస: నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు, సిబ్బంది



పాలకొండ రూరల్: వెంకటరమణారావు చిత్రపటం వద్ద సంతాపం తెలియజేస్తున్న మండల పరిషత్ ఉద్యోగులు

జియ్యమ్మవలస: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలంలో ఎంపీడీఓగా పనిచేసిన వెంకటరమణరావు ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సంఘటన విధితమే. రాజకీయ ఒత్తిడి వలనే ఆయన ఆత్మహత్య చేసుకున్నారని, అందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీడీఓ శ్రీనివాసరావు, సిబ్బంది గురువారం నిరసన తెలిపారు. వెంకటరమణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

పాలకొండ రూరల్: నరసాపురం ఎంపీడీఓ వెంకటరమణరావు మృతి చెందడంతో స్థానిక మండల పరిషత్ ఉద్యోగులు బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం తెలియజేశారు.

వృత్తిపరమైన ఒత్తిడి వల్లే రామకృష్ణ మృతి చెందారని పలువురు అన్నారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కె.సూర్యనారాయణ, తదితరులున్నారు.

108లో ప్రసవం

సీతంపేట: మండలంలోని ఎత్తైన కొండలపై ఉన్న చాపరాయిగూడకు చెందిన వి.గురిబాడి అనే మహిళ బుధవారం 108లో ప్రసవమైంది. ఇంటివద్ద పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108కు ఫోన్ చేశారు. ఈఎంటీ రమేష్‌బాబు, పైలెట్ శంకరరావు గ్రామానికి చేరుకుని గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో నొప్పులు రావడంతో ప్రసవం జరిపించారు. అనంతరం తల్లీబిడ్డను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విజ్ఞానాన్ని పెంచుకోవాలి

● డిప్యూటీ డీఈఓ కృష్ణారావు



పాలకొండ రూరల్: మంగళాపురంలో విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు



సీతంపేట: విద్యార్థినులను పరిచయం చేసుకుంటున్న డీడీ అన్నదొర

పాలకొండ రూరల్: జాతీయ విద్యావిధానం ద్వారా విద్యార్థులు తమలో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను ప్రాజెక్ట్‌ల రూపంలో బయట పెట్టాలని డిప్యూటీ డీఈఓ పి.కృష్ణారావు అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు గాను బుధవారం ఆయన మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా గొట్ట మంగళాపురం, చిన మంగళాపురం, గోపాలపురం, తదితర గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లను పరిశీలించి, వాటి ఆవశ్యకతను అడిగి తెలుసుకున్నారు.

క్రీడాస్ఫూర్తి పెంపొందించుకోవాలి..

సీతంపేట: విద్యార్థినుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర కోరారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో స్పోర్ట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ పి.నారాయుడు, ఏఎంఓ పి.కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు, జీసీడీఓ రాములమ్మ, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, హెచ్ఎం పి.పద్మశ్రీ, హెచ్‌డబ్ల్యూఓ పి.అమల, తదితరులు పాల్గొన్నారు.

27న మండల సమావేశం

భామిని : మండల సమావేశం ఈ నెల 27న స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొవ్వాడ కిశోర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఈ సమావేశాన్ని 25న నిర్వహిస్తామని సభ్యులకు నోటీసులు పంపించామని, అయితే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో మార్పు చేసినట్లు పేర్కొన్నారు సభ్యులు గమనించాలని కోరారు.

రక్తపూతల సేకరణ

భామిని: మండలంలోని ఎరకరాయిగూడలో బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె. దామోధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల నుంచి రక్తపూతలు సేకరించారు. జ్వరాలున్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ నర్సయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వాలి



ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న ఏఓ సింహాచలం

భామిని: ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్న వారు రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి కొర్ను సింహాచలం అన్నారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాకు రికార్డులు పరిశీలించారు. దుకాణంలో తప్పనిసరిగా స్టాక్‌బోర్డు ఉంచాలని సూచించారు.

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

పాలకొండ: మండలంలోని కొండాపురంలో సచివాలయ సిబ్బంది పరిసరాల పరిశుభ్రతపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే వీధుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీ రోడ్డులో దిగబడిన లారీలు

భామిని: మండలంలోని ఏబీ రోడ్డు గోతులలో బుధవారం లారీలు దిగబడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. భామిని మండలం బిల్లుమడ-గురండి మధ్య ఏబీ రోడ్డులో ఒడిశా నుంచి వస్తున్న ఇసుక లారీ దిగబడింది. మరో లారీ కాట్రగడ-బి-బ్యారేజ్ మధ్య రోడ్డుపై చిక్కుకుంది. దీంతో మండలంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. కొత్తూరు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు నులకజోడు వద్ద నిలిపివేసి భామిని వైపు వెనుదిరిగాయి, దీంతో బత్తిలి వైపు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు.

గిరిజన విద్యార్థికి ఐఐటీ కాన్పూర్‌లో సీటు



రోహిత్‌కుమార్

సీతంపేట: గిరిజన విద్యార్థి మూటక రోహిత్‌కుమార్ ఎటువంటి కోచింగ్ తీసుకోకుండానే ఐఐటీ కాన్పూర్‌లో సీటు సంపాదించాడు. ఈ మేరకు ఈ నెల 23న కళాశాలలో చేరాడు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మొదటి ప్రయత్నంలోనే 681 ర్యాంక్ సాధించాడు. విద్యార్థి తండ్రి మూటక గోపాలకృష్ణ స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. వీరి స్వగ్రామం జీఎల్‌పురం మండలం లికిడి. రోహిత్‌కుమార్ విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్లో ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూపు పూర్తి చేశాడు.

నైతిక విలువలు పెంపొందించాలి

● విశాఖ జోన్–1 ఆర్‌జేడీ విజయభాస్కర్



మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

పాలకొండ రూరల్: తరగతి గదిలో ఉపాధ్యాయుల ప్రవర్తన, బోధన ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని విశాఖ జోన్–1 ఆర్‌జేడీ విజయభాస్కర్ సూచించారు. డీఈఓ పగడాలమ్మతో కలిసి బుధవారం పాలకొండ వచ్చిన ఆయన స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న టీచ్ టూల్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టీచ్ టూల్ ఆవశ్యకత, లక్ష్యాలను ఉపాధ్యాయులకు వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల సహృదయంతో వ్యవహరించాలన్నారు. వృత్తిపరమైన ఒత్తిడి పిల్లలపై పడకుండా చూస్తూ.. వారు క్రమంతప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. శాఖాపరంగా అందిస్తున్న శిక్షణలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్, డిప్యూటీ డీఈఓ పి.కృష్ణమూర్తి, ఎంఈఓ కె.సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పుచేసి అమరావతి కడతారా..!

● మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు వరాల జల్లు అని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నాయకులు అందులో ఉన్న షరతులను చెప్పుకోలేకపోతున్నారని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఎద్దేవా చేశారు. వండవలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, అమరావతి నిర్మాణానికి వరల్డ్ బ్యాంక్ ద్వారా రూ.15 వేల కోట్లు అప్పు ఇప్పించడానికి కేంద్రం సిఫార్సు చేస్తుందే తప్ప, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వదని బడ్జెట్‌లో స్పష్టంగా తేల్చి చెప్పారన్నారు. ఈ లెక్కన చూస్తే అప్పు చేసి అమరావతిని కట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని చెప్పారు. అమరావతి నిర్మాణం వల్ల అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకునేవారికే లాభం తప్ప, రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ప్రయోజనం ఉండదని తెలిపారు. తల్లికి వందనం పథకం అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తోందన్నారు. ఈ ఏడాది విధి విధానాలను పరిశీలించి వచ్చే అకడమిక్ ఇయర్‌లో పథకం అమలు చేస్తామని మంత్రి నారా లోకేష్ చెప్పడం సరికాదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఈ ఏడాదే తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నాడు – నేడు పథకం ద్వారా సర్కారు బడులను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

రహదారులను మెరుగుపరచాలి



అధ్వానంగా ఉన్న తామర చెరువుకు వెళ్లే రహదారి



ఊరచెరువుకు వెళ్లే రహదారి దుస్థితి

గరుగుబిల్లి: పంట పొలాలకు వెళ్లే రహదారులను మెరుగుపరచాలని నందివానివలసకు చెందిన పలువురు రైతులు కోరుతున్నారు. తోటపల్లి పంచాయతీ నందివానివలస గ్రామం నుంచి తామర చెరువుకు వెళ్లే రహదారితో పాటు, గ్రామం నుంచి ఊర చెరువుకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోందని అంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లేందుకు, పంటను ఇంటికి తెచ్చుకునేందుకు అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు.

అలాగే ఇదే మార్గంలో తోటపల్లి, సింగనాపురం, గదబవలస గ్రామాలకు రాకపోకలు చేసేందుకు అనుకూలంగా ఉంటుందని ఆయా గ్రామస్తులు అంటున్నారు. అధికారులు స్పందించి రహదారులను బాగుచేయాలని వారంతా కోరుతున్నారు.

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి



మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వండిపెట్టాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు అన్నారు. మండలంలోని నవిరి ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకంలో తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు వండి పెడుతున్నారా లేదా అని ఆరాతీశారు. పాఠశాల, వంటగది పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

నూతన విద్యావిధానానికి నాలుగేళ్లు



చెముడుగూడ పాఠశాలలో క్యారెమ్స్ ఆడుతున్న విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: జాతీయ నూతన విద్యా విధానానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని పాఠశాలల్లో ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు శిక్షా సప్తాహ్ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం స్పోర్ట్స్ డే నిర్వహించారు. వివిధ రకాల క్రీడాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో వివిధ రకాల ఆటలు ఆడించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. డాక్టర్ కృష్ణస్వామి కస్తూరిరంగన్ కమిటీ సిఫార్సుల మేరకు 2020లో జాతీయ నూతన విద్యావిధానాన్ని(ఎన్ఈపీ) ప్రవేశపెట్టారన్నారు. అప్పటి వరకు 10+2+3గా ఉన్న విద్యా విధానాన్ని రద్దు చేసి 5+3+3+4 విధానాన్ని అమలు చేశారన్నారు. ఈ విధాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శిక్షా సప్తాహ్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఏపీడీ శ్రీహరిరావు

వీరఘట్టం : ఫీల్డ్ అసిస్టెంట్లు మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని ఉపాధి హామీ ఏపీడీ శ్రీహరిరావు సూచించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఫీల్డ్ అసిసెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 50 ఎకరాల్లో ప్లాంటేషన్ చేసేందుకు రైతులకు మొక్కలు పంపిణీ చేసినట్లు చెప్పారు. మొక్కలన్నీ నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎవెన్యూ ప్లాంటేషన్‌పై కూడా దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఏపీఓ సత్యంనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు డి.శ్రీనివాసరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.